
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 12 డిసెంబరు 2024



ప్రజలకు నమ్మకం కలిగించాలి : డీఐవో

మర్కూక్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మర్కూక్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మండలంలోని మినీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకళ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపీ శాతాన్ని పెంచి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యకేంద్రాలను సందర్శించి బాలింతలకు, గర్భిణులకు తగుజాగ్రత్తలు సూచించారు.

న్యూస్ బాక్స్



ఆరోగ్యమే మహాభాగ్యం

● సీపీ అనురాధ

సిద్దిపేటక్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యమే మహాభాగ్యమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో సిద్దిపేటలో ఉన్న మమత కంటి ఆసుపత్రి, రిచ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, శ్రీ మంజునాథ గ్యాస్ట్రో లివర్ మెటర్నరీ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. వైద్యశిబిరంలో సీపీ బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అలాగే కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని చెప్పారు. యోగా, వ్యాయామం దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులకు సీపీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించాలి

● యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలకు మత్తుపదార్థాలు రాకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం ధర్మారంలో 13న నిర్వహించే రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ 2కె రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆయన తన బృందంతో పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు.

డాక్టర్లు రారు.. మందులు ఉండవు!

ఇదీ..జిల్లాలో పీహెచ్‌సీల పనితీరు!

- అన్నీ ఉంటే సిబ్బంది కొరత
- ఇష్టారాజ్యంగా సమయపాలన
- మొక్కుబడి తనిఖీలతో అంతా అస్తవ్యస్తం
- కొత్త డీఎంహెచ్‌వో దృష్టిసారించేనా?

అక్కన్నపేటలోని ఆరోగ్య ఉప కేంద్రం 10.30 గంటలైనా తాళం వేసి ఉండడంతో చిన్నపిల్లలకు టీకాలు వేయించేందుకు తీసుకొచ్చిన మహిళలకు ఎదురుచూపులు తప్పలేదు. ఉదయం 9 గంటలకు తాళం తీయాల్సిన ఏఎన్ఎం సమయానికి రాకపోవడంతో చిన్నారులను ఎత్తుకొని గంటన్నర పాటు వేచిచూసే పరిస్థితి నెలకొంది."

"మద్దూరు మండలం లద్నూరు పీహెచ్‌సీలో ఉదయం 9.45 గంటల వరకు కూడా వైద్యాధికారి, సిబ్బంది రాలేదు. గతంలో డీఎంహెచ్‌వో తనిఖీ చేసినా ఎలాంటి మార్పు లేదు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉదయం 9 గంటలకే తెరిచారు. ఫార్మసిస్టు మాత్రమే వచ్చారు. 10.30 గంటలు దాటినా మిగితా సిబ్బంది కానరాలేదు."

"కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నపిల్లలకు ఇచ్చే డీపీటీ వ్యాక్సిన్ అందుబాటులో లేదు. డాక్టర్ సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. స్టాఫ్ నర్సు లేక డెలివరీ కేసులు తీసుకోవడం లేదు. పీహెచ్‌సీ నిర్వహణపై రెండు రోజుల క్రితమే బిజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. పలుమార్లు డీఎంహెచ్‌వో తనిఖీ చేసినా చర్యలు శూన్యం"

ఆంధ్రజ్యోతి విజిట్



ఉదయం 9.30 గంటల వరకు కూడా తెరుచుకోని చేర్యాల మండలం ముస్త్యాల పీహెచ్‌సీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు11: జిల్లాలోని నాలుగు దిక్కులా విస్తరించిన మద్దూరు, అక్కన్నపేట, కుకునూరుపల్లి, బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్యసేవలకు ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి. ఈ ఆసుపత్రుల్లోనే కాదు... పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్వహణపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులున్నాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి' బృందం పీహెచ్‌సీలను విజిట్ చేయగా లోటుపాట్లు తేటతెల్లమయ్యాయి.

తనిఖీలు చేపడితేనే

ఉదయం 9 గంటలకు తెరుచుకోవాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొన్ని దారి తప్పుతున్నాయి. ఆలస్యంగా తెరుచుకుంటున్నాయి. అత్యవసర విభాగమైన వైద్యవృత్తిలో ఉంటూ ఆలస్యంగా వస్తున్న వారు కూడా ఎంతోమంది ఉన్నారు. నిత్యం


అక్కన్నపేటలోని ఆరోగ్య ఉప కేంద్రం ఎదుట ఏఎన్ఎం కోసం ఎదురుచూస్తున్న చిన్నపిల్లల తల్లులు

డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పరోక్షంగా పర్యవేక్షిస్తున్నప్పటికీ ప్రత్యక్షంగా తనిఖీలు కూడా చేపట్టాల్సిన అవశ్యకత ఉంది. డీఎంహెచ్‌వో సహా ఇతర అధికారులు ఏదో ఒక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేస్తే మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు. జిల్లాలో గతంలో పనిచేసిన వైద్యశాఖ ఉన్నతాధికారులు పీహెచ్‌సీలపై సరైన దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో కొత్త డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన పల్వన్ కుమార్ ఈ విషయంలో తగిన పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు ఆసుపత్రులతో పాటు సర్కారు వైద్యసేవలనూ ప్రజలకు అందించాల్సిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

- సిద్దిపేటలోని ఇందిరమ్మ బస్తీ దవాఖానాలో డ్యూటీ డాక్టర్ 10 రోజుల క్రితం రిజైన్ చేసి వెళ్లారు. కొత్తవారిని నియమించకపోవడంతో స్టాఫ్ నర్సు వైద్యం అందిస్తోంది.
- కొండపాక పీహెచ్‌సీలో డాక్టర్ సెలవులో ఉన్నారు. ఫార్మసిస్టు తండ్రి చనిపోయిన కారణంగా రాలేదు. స్టాఫ్ నర్సు కూడా సెలవులోనే ఉన్నారు. ఆయుర్వేద వైద్యురాలు రజిత మాత్రమే అందుబాటులో ఉన్నారు.
- రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సెలవులో ఉన్నారు. లివోసిట్రిజన్ టాబ్లెట్లు, డైక్లోఫినాక్ ఇంజక్షన్ల కొరత ఉంది.
- గజ్వేల్ మండలం అహ్మదీపూర్ పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు లేక

మిగతా 8వ పేజీలో...



మొక్కజొన్నకు కత్తెర పోటు

- మందులు పిచికారీ చేసినా సోకుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

8



కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా ట్రైనింగ్
- మూడు నెలల పాటు తరగతులు
- 59 మంది మాస్టర్లతో..

7

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- పుల్‌కల్‌లో సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ ఢీకొని వెల్డర్
- నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొని ఇద్దరు
- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు
- బైక్ అదుపుతప్పి యువకుడు..

7

ధాన్యం దళారుల పాలు

- జిల్లాలో పెరిగిన వరి సాగు విస్తీర్ణం
- కేంద్రాల్లో తగ్గిన ధాన్యం సేకరణ
- సకాలంలో కేటాయింపులు లేక అవస్థలు
- నేరుగా వ్యాపారులకు విక్రయించిన రైతులు

దుబ్బాక, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రైతులను కష్టాలు అడుగడుగునా వెంటాడుతున్నాయి.. భూగర్భజలాలు అడుగంటి పంటలకు సరిపడా నీరందక, ఆ తర్వాత అకాల వర్షాలు, పంట చేతికొచ్చినా కొనుగోళ్లు జరగక ఇలా అన్నదాతలు అల్లాడుతున్నారు. సకాలంలో కొనుగోళ్లు జరగక చివరికి ప్రభుత్వ కొనుగోళ్ల కంటే దళారులే నయమని వారిని ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 2021-22 నుంచి క్రమంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వ పాలసీలో మార్పులు చోటుచేసుకోవడం, ధాన్యం కొనుగోలు చేస్తారో లేదో అనే అపనమ్మకంతో రైతులు దళారులకు విక్రయిస్తున్నారు.


కల్లాల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

వర్షాలు లేకున్నా..

వర్షాలు సమృద్ధిగా కురవకున్నా జిల్లాలో యేటా వరిసాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. 2022లో వర్షాకాలంలో 3.62లక్షల ఎకరాల్లో సాగు చేశారు. యాసంగిలో తగ్గాల్సి ఉండగా నీటి వనరులు అధికంగా ఉండడంతో 3.69లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 2023లో వర్షాకాలంలో 3.9లక్షల ఎకరాల్లో, అదే యేడు యాసంగిలో 3.15లక్షల ఎకరాల్లో 2024 వర్షాకాలంలో 3,76,901 ఎకరాల్లో సాగు చేశారు.

కల్లాల వద్దే కొనుగోళ్లు..

ప్రభుత్వం మారడంతో ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం, నూతన ప్రభుత్వ పాలసీలు రైతులను అయోమయానికి గురి చేయడం కూడా ఒకందుకు కారణం. ఈ క్రమంలో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది.


దౌల్తాబాద్‌లో ఓ వ్యాపారి దుకాణం నుంచి ఆటోలోకి బస్తాలను చేర్చుతున్న హమాలీలు

జిల్లాలో 2021లో వర్షాకాలం 3,99,314 మెట్రిక్ టన్నులు, యాసంగిలో 3,92,457 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 2022లో 3,65621 మెట్రిక్ టన్నులు, అదే ఏడాది యాసంగిలో 3,69,365 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. 2023 వానాకాలం 3,09,026 మెట్రిక్ టన్నులు, యాసంగిలో 3,15000 మెట్రిక్ టన్నులు సేకరించారు. ఈసారి సీజన్ దాదాపు పూర్తికావొస్తుండడంతో ఇప్పటి వరకు జిల్లాలో 99 శాతం అమ్మకాలు పూర్తయ్యాయి. 2024 వానాకాలానికి సంబంధించి బుధవారం నాటికి 2,57000 మెట్రిక్‌టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు.

గత ప్రభుత్వం రైస్‌మిల్లర్ల వద్ద ధాన్యాన్ని నిల్వ చేయడంతో పాటు, సామర్థ్యం లేని మిల్లర్లకు కూడా కేటాయింపులు చేయడంతో నాలుగేళ్లుగా బియ్యం నూర్పిడి జరగలేదు. అలా ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడం, మిల్లర్లకు కేటాయింపులు చేపట్టకపోవడంతో కొనుగోలు కేంద్రాలు బోసిపోయాయి. వర్షాలకు భయపడి చాలా మంది రైతులు దళారులను ఆశ్రయించారు. కల్లాల వద్దనే వ్యాపారులు రూ.1890 చొప్పున ధాన్యాన్ని కొనుగోలు చేశారు. తాలు పేరిట సుమారు 10 కిలోల వరకు కోత విధించినా కూడా రైతులు వారికే మొగ్గుచూపారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోపాటు, ప్రభుత్వ తీరుతో ఈసారి వరిసాగు విస్తీర్ణం పెరిగినా కూడా ధాన్యం సేకరణ తగ్గింది.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

సిద్దిపేటరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి తెలిపారు. బుధవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. జక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయం బాగున్నప్పటికీ దాని స్థానంలో రూ.30లక్షలతో అధునాతన వసతులతో కూడిన గ్రంథాలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. పుస్తకాలు, దినపత్రికలు, మౌలిక వసతులను కల్పిస్తానని చెప్పారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్, పంచాయితీ కార్యదర్శి నరసింహచారి, డీసీసీ ఉపాధ్యక్షుడు పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, పలువురు ఉన్నారు.


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మూడున్నర ఏళ్ల బాలికపై లైంగిక దాడి?

మెదక్, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో మూడున్నర ఏళ్ల బాలికపై ఓ ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన బుధవారం వెలుగు చూసింది. పట్టణ శివార్లలోని పిల్లికోటాల్ డబుల్‌బెడ్‌రూం కాలనీలో నివాసముండే ఆటోడ్రైవర్ అజంపురా వీధిలో ఓ ఇంట్లో మూడున్నర సంవత్సరాల వయస్సు గల చిన్నారికి చాక్లెట్లు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆటోడ్రైవర్ బంధువులు అజంపురాలోనే ఉండడంతో తరచూ వారి ఇంటికి వచ్చే వాడని, ఈక్రమంలో బాలికను మచ్చిక చేసుకుని లైంగికంగా దాడి చేసినట్లు సమాచారం. విషయం బయటికి పొక్కడంతో పోలీసులు బాలికను భరోసా సెంటర్‌కు తరలించినట్లు తెలిసింది.

కానిస్టేబుళ్ల కుటుంబాలకు అండగా ఉంటాం : గజ్వేల్ ఏసీపీ

గజ్వేల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు పోలీస్‌శాఖ తరపున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని గజ్వేల్ ఏసీపీ కే.పురుషోత్తంరెడ్డి అన్నారు. తొగుట సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డ్స్ ఆధ్వర్యంలో సమీకరించిన రూ.3లక్షలను దివంగత కానిస్టేబుళ్ల పరంధాములు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు బుధవారం ఏసీపీ వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. పోలీస్‌శాఖ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన వచ్చేందుకు కృషిచేస్తామన్నారు. ఆయన వెంట తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్‌ప్రదీప్, తొగుట ఎస్ఐ రవికాంతారావు, బేగంపేట ఏఎస్ఐ అమృత్, రాయపోల్ ఏఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఏసీపీ, సీఐ



రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు సూర్యతేజ్



సిద్దిపేట రూరల్,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మోడల్ స్కూల్ విద్యార్థి సూర్యతేజ్ ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్ కొడకండ్లలో జిల్లా మ్యాథ్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో సూర్యతేజ ద్వితీయ విజేతగా నిలిచాడన్నారు. ఈ సందర్భంగా సూర్యతేజను ప్రిన్సిపాల్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, చంద్రారెడ్డి, అనిత, సుహాసిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





అహ్మదీపూర్ గ్రామానికి వెళ్లే దారిలో వరిధాన్యం

రోడ్లపైనే ధాన్యం

కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నా.. ఇంకా రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గజ్వేల్ మండల కేంద్రంలోని అహ్మదీపూర్, సింగాటం, శేరిపల్లి గ్రామాల్లో కొందరు రైతులు రోడ్డుకు సగం వరకు ధాన్యం ఆరబెట్టారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి)



సింగాటం వెళ్లే దారిలో...



తూతూ మంత్రంగా సీఎం కప్ క్రీడలు

దుబ్బాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలంలో సీఎం కప్ క్రీడలను అధికారులు తూతూ మంత్రంగానే నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో యువతకు, యువజన సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే క్రీడలను ప్రారంభించారు. బుధవారం ఉదయం ప్రారంభమై, సాయంత్రానికి ముగించారు. బుధవారం నిర్వహించిన క్రీడల్లో మున్సిపాలిటీ నుంచి 7 టీంలు, గ్రామీణ ప్రాంతాల నుంచి 13 టీంలు పాల్గొన్నాయి.అందులో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో మాత్రమే నిర్వహించారు. ఇందులో 18 ఏండ్లు దాటిన వారు వాలీబాల్ టీంలో 7 టీంలు పాల్గొన్నాయి. కబడ్డీలో 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు వయస్సు ఉన్న 13 టీంలు పాల్గొన్నాయి. ఖోఖోకు రెండు టీంలు మాత్రమే వచ్చాయి. క్రీడలకు యువతను, క్రీడాకారులను ఆహ్వానించే బాధ్యతను గ్రామస్థాయిలో గ్రామ కార్యదర్శులకు అప్పగించగా, వారు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో బిజీగా ఉండటంతో యువతకు సమాచారం ఇవ్వలేకపోయారని తెలుస్తోంది. మరో పక్క పనిభారం కారణంగా అధికారులూ క్రీడలపై పెద్దగా శ్రద్ధ చూపలేదని తెలుస్తోంది. మండలంలో బుధవారం జరిగిన సీఎం కప్ క్రీడల కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ బాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట కబడ్డీ పోటీలో వాగ్వాదానికి దిగిన క్రీడాకారులు

సీఎం కప్ క్రీడల్లో ఉద్రిక్తత

చిన్నశంకరంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ కారణంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబాజీపేట, జంగరాయి తండ క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో తలపడగా, పాయింట్ల విషయంలో వివాదం చెలరేగి, ఒకరిపై మరొకరు దాడి చచేసుకున్నారు. అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇరు జట్లను సముదాయించారు. ఈ పోటీని హోల్డ్‌లో పెట్టి.. చందంపేట-శాలిపేట టీంల మధ్య పోటీ నిర్వహించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

టేక్మాల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాదులూరు గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు పూర్తి ఏర్పాట్లు చేశారు. జాతరలో భాగంగా భక్తులు బోనాలను ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ యాదయ్య ముదిరాజ్, సంఘం అధ్యక్షుడు రాజేందర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

వీరభద్ర ప్రసన్న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

వట్‌పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో శ్రీ వీరభద్రేశ్వర ప్రసన్న ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వీరశైవ లింగాయత్‌లు, ఆర్యవైశ్యులు, విశ్వ బ్రాహ్మణులు, గ్రామస్థులు ఆలయ నిర్మాణం కోసం చందాలు వేసుకుని పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠాధిపతి డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి శంకుస్థాపన చేశారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీఠాధిపతి



14న దత్తజయంతి

మెదక్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన ఏకముఖ దత్తాత్రేయ స్వామి ఆలయం వేడుకలకు సిద్ధమైంది. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో గురువారం నుంచి 14వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దేశాయిపేట పాండురంగ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14న స్వామి వారి జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు.


ఆరో రోజుకు సమ్మె

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్ చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్ పాల్గొన్నారు.

మెదక్‌లో టీ కప్పులతో నిరసన

మెదక్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమను క్రమబద్దీకరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజుకు చేరింది. బుధవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గతేడాది దీక్ష శిబిరానికి వచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చాయ్ తాగినంత సేపట్లో మీ సమస్యను పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. దానిని గుర్తు చేస్తూ.. టీ కప్పులతో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, కనకరాజు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.







పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్త!

- మీ పెట్స్ వీధిలో టాయిలెట్ చేస్తే జరిమానా
- యజమానే శుభ్రం చేయాలి

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా పెంపుడు కుక్కతో బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయిస్తున్నారా.. అయితే జాగ్రత్త ! అలా చేస్తే మున్సిపాలిటీకి జరిమానా చెల్లించాల్సిందే. మున్సిపల్ చట్టంలో ఉన్న ఈ నిబంధనను అన్ని బల్దియాల్లో అమలు కానున్నది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కమిషనర్ టీకె శ్రీదేవి నుంచి అన్ని మున్సిపాలిటీల కమిషనర్లకు ఇటీవలే ఆదేశాలు జారీ అయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 61,622 వీధి కుక్కలు ఉండగా, దాదాపు 1521 పెంపుడు కుక్కలు ఉన్నట్టు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి మున్సిపాలిటీలో రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తుంది. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం మధ్య వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ.. అక్కడే మల, మూత్ర విసర్జన చేస్తుంటాయి. దీన్ని అరికట్టలేక మున్సిపాలిటీల సిబ్బంది సతమతమవుతున్నారు. దీనికి తోడు పెంపుడు కుక్కల యజమానులు తమ శునకాలను వాకింగ్ చేయిస్తూ బహిరంగ ప్రదేశాల్లోనే మల,మూత్ర విసర్జన చేయిస్తుండటం సాధారణంగా మారిపోయింది. ఇలా చేయిస్తే యజమానే దాన్ని శుభ్రం చేయాల్సి ఉంటుంది. అంతేగాక యజమాని రూ.వేయి నుంచి అంతకంటే ఎక్కువే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.



చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం

పారిశుధ్యం పరిరక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా గుర్తించాలి. బహిరంగ ప్రదేశాల్లో పెంపుడు కుక్కలు మలమూత్ర విసర్జన చేస్తే సంబంధిత యజమానులకు జరిమానాలు విధిస్తాం. చట్టం కఠినంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ విషయంలో పెంపుడు కుక్కల యజమానులు కూడా అవగాహన కలిగి ఉండాలి. ఎవరైనా పెంపుడు కుక్కలను వీధుల్లో మల విసర్జన చేయిస్తే యజమానితోనే శుభ్రం చేయిస్తారు. లేదా యజమానికి జరిమానా వేస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పట్టణాల్లో పరిశుభ్రత సాధ్యమవుతుంది.

- మనోజ్, శిక్షణా కలెక్టర్, సంగారెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- పుల్‌కల్‌లో సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ ఢీకొని వెల్డర్
- నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో ఇద్దరు
- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు
- అదుపు తప్పి బైక్ కిందపడడంతో యువకుడు మృతి


మహమ్మద్ శాబొద్దీన్ మృతదేహం

పుల్‌కల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ సమీపంలోని సంగారెడ్డి - నాందేడ్ - అకోలా 161 జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట పట్టణంలోని సయాజీనగర్‌కు చెందిన మహమ్మద్ శాబొద్దీన్(39) చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న దాబాలో వెల్డింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. కటింగ్ బ్లేడ్ ఇతర పని ముట్లను కొనుగోలు చేసేందుకు బైక్‌పై చౌటకూర్ గ్రామానికి వెళ్తుండగా, హైవే సర్వీసు రోడ్డుపై ఎదురుగా అతివేగంతో ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వస్తున్న డ్రైవర్ మంగలిబాబు మోటారు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శాబొద్దీన్ తలకు, ఎడమ వైపు కాలుకు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. శాబొద్దీన్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహనికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు మహమ్మద్ చాంద్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు.

మద్యం తాగి బైక్‌తో ఢీకొనగా..


కొత్తపల్లి శ్రీహరి మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన ఒకరు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. పొన్నాలకు చెందిన కొత్తపల్లి శ్రీహరి(40) నర్సాపూర్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లడానికి, పొన్నాల స్టేజి వద్ద రాజీవ్ రహదారిని దాటి రాఘవేంద్ర హోటల్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న దుద్దెడ మదిర సేలంపు గ్రామానికి చెందిన చిలుముల రమేష్ మద్యం తాగి అజాగ్రత్తతో బైక్‌ను నడుపుతూ శ్రీహరిని ఢీకొన్నాడు. దీంతో అతడు కింద పడగా, బలమైన గాయాలు అయ్యాయి. శ్రీహరిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీహరి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గజ్వేల్‌లో బైక్ ఢీకొని వృద్ధుడు..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగుపల్లికి చెందిన బడే ఎల్లయ్య(78) ఓ కాంట్రాక్ట్ దగ్గర పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పట్టణంలోని డివైడర్‌పై మొక్కలకు నీళ్ల పట్టేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేగుంట నుంచి గజ్వేల్‌కు బైక్‌పై గుమ్మడి జైపాల్.. నడుచుకుంటూ వెళ్తున్న ఎల్లయ్యను ఢీకొట్టగా, అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వల్లూరులో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి..

చేగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వల్లూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. నార్సింగి ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ బాలనగర్ రాజు కాలనికి చెందిన జంగపల్లి పాండురంగ చారి (55) సొంత పనిపై నార్సింగి మండల కేంద్రానికి మంగళవారం ఉదయం వచ్చాడు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ కు వెళ్తున్నానని బయలుదేరాడని వల్లూర్ శివారులో అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని పాండురంగచారి మృతి చెందారు. డ్యూటీలో ఉన్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి అనుకొని శవాన్ని రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య చంద్రకళ తన భర్త పాండురంగ చారి అని గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామచంద్రాపురం పీఎస్ పరిధిలో..

రామచంద్రాపురం, డిసెంబరు 11 : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం... రామచంద్రాపురం పట్టణానికి చెందిన రమేష్(25) అతని మిత్రుడు ధన్‌రాజ్ బుధవారం బైక్‌పై లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్నారు. పట్టణంలోని నాగులమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి కిందపడగా.. రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ధన్‌రాజ్‌కు గాయాలయ్యాయి. రమేశ్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి


రేవంత్(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువకుడు నీటిగుంతలో పడి మృతిచెందిన సంఘటన హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో చోటచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్లపల్లికి చెందిన రంగు రేవంత్(17) మంగళవారం తన తండ్రి సంపత్, తల్లి సరోజనతో కలిసి వ్యవసాయ బావి వద్దకు పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం పనులు ముగించుకుని ముందుగా రేవంత్ తల్లితండ్రి ఇంటికి తిరిగి వెళ్లారు. రాత్రయినా రేవంత్ ఇంటికి రాకపోవడంతో రాత్రంతా తల్లితండ్రులు అతడి కోసం వెతకగా, ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళుతుండగా.. దారిలోని నీటిగుంతలో పడి శవమై కనిపించాడు. రేవంత్ మృతదేహం వద్ద తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. రేవంత్‌కు ఈత రాకపోవడంతోనే నీటి గుంతలో మునిగి ప్రాణాలు వదిలుంటాడని అనుమానిస్తున్నారు.

తల్లీకొడుకు అదృశ్యం


కుమారుడు అశ్రుబీదాస్‌తో రాణికుమారి(ఫైల్)

రామచంద్రాపురం, డిసెంబరు 11 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గోపన్‌దాస్ తన భార్య రాణికుమారితో కలిసి మై హోం నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం తన భార్య, 4 సంవత్సరాల కుమారుడు అశ్రుబీదాస్ ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అదే రోజు పనులు ముగించుకుని వచ్చిన గోపన్‌దాస్ తన భార్య గురించి ఇరుగుపొరుగు వారిని విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో స్వరాష్ట్రానికి ఏమైనా వెళ్లి ఉంటుందోనన్న ఆలోచనతో అలాగే ఒంటరిగా ఉండిపోయాడు. పది రోజులైన భార్య, కొడుకు రాకపోవడంతో బుధవారం కొల్లూరు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తొగుట మండలం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణలో విద్యార్థినులు

కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా..

మూడు నెలల పాటు తరగతులు

59 మంది మాస్టర్‌లతో ట్రైనింగ్

తొగుట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల పాటు.. రోజుకు గంట బాలికలకు ఉచితంగా కరాటేలో శిక్షణనిస్తున్నారు.

ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం



బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించాం. ఈ ఏడాది 258 పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించాం. మూడు నెలల పాటు బాలికలకు శిక్షణ ఇప్పించడానికి నిష్ణాతులైన 59 మంది శిక్షకులను నియమించాం. ప్రతి ఏటా ఉచిత శిక్షణ తరగతులను కొనసాగిస్తాం.

- ముక్తేశ్వరి, జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

258 పాఠశాలల్లో ఉచిత శిక్షణ

సిద్దిపేట జిల్లాలోని 203 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 కస్తూర్బా గాంధీ, 16 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, 4 మోడల్ స్కూల్‌లు కలిపి మొత్తం ఈయేడు 258 పాఠశాలలను అధికారులు ఎంపిక చేసి నవంబరు 20న ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 20 వరకు శిక్షణ కొనసాగనున్నది. ఉచిత కరాటే శిక్షణ కోసం 59 మంది నిష్ణాతులైన మాస్టర్‌లను ప్రభుత్వం నియమించింది. వారి కోసం ఒక్కో పాఠశాల సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.5వేల చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో శిక్షకుడు నాలుగు లేదా ఐదు పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో పాఠశాలలో రోజుకు గంటపాటు శిక్షణ ఇస్తుండటంతో బాలికల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తుంది. శిక్షణలో ఎదుటి వారి నుంచి ఆత్మరక్షణ ఎలా పొందాలో శిక్షకులు బాలికలకు మెలకువలు నేర్పిస్తున్నారు. దాంతో బాలికలు శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని తమను తాము ఎలా రక్షించుకోవాలో నేర్చుకుంటున్నారు.

ఆత్మరక్షణకు దోహదం



కరాటే నేర్చుకోవడం మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. శిక్షణలో నేర్చుకుంటున్న మెలకువలు మాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతీ బాలిక కరాటే నేర్చుకొని ఆత్మనిబ్బరంతో ముందుకు సాగాలి

- వర్షిణి, 9వ తరగతి, ఎల్లారెడ్డిపేట

విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అందిస్తున్న ఆత్మరక్షణ విద్య చాలా ఉపయోగకరంగా ఉంది. మేము బయటకు వెళ్లినపుడు ఎవరి వల్లనైనా ఇబ్బంది ఎదురైతే.. మమ్మల్ని మేము ఎలా రక్షించుకోవాలో నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలి.

- లిహారిక పదో తరగతి, ఘనపూర్

ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిది



కరాటే శిక్షణ తరగతుల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిక్షణలో విద్యార్థులు వారిని వారు ఏవిధంగా రక్షించుకోవాలో మెలకువలు నేర్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ తరగతులు పెట్టి, ఉపాధి చూపించి ప్రోత్సహించడం మరువలేనిది.

- చీకోటి సుధాకర్, కరాటే మాస్టర్

ఎల్‌సీడీసీ ప్రోగ్రాంను పరిశీలించిన కేంద్ర వైద్య బృందం


పీహెచ్‌సీ వద్ద కేంద్ర వైద్య బృందం

మనోహరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య బృందం 2 నుంచి 15వ తేదీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను నిర్వహిస్తున్నది. బుధవారం కేంద్ర వైద్య బృందం మండలంలోని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఎల్‌సీడీసీ ప్రోగ్రాంను పరిశీలించారు. శరీరం మీద స్పర్శ, గోదుమ రంగు మచ్చలు, ఇతర ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో వారు మాట్లాడుతూ బహు ఔషధ చికిత్స ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించవచ్చని తెలిపారు. ఆలాగే తూప్రాన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్‌రావును తగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు హరికృష్ణ, బాలక్రిష్ణ, జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, శ్రీనివాస్, వెంకటరమణ, వైద్య అధికారి, సమత, బాలనర్సయ్య, సంతోష్ కుమార్, సూపర్‌వైజర్లు, కృష్ణ, శారథ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- ఎవరికి నయా పైసా ఇయ్యొద్దు
- డబ్బు అడిగితే కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేయండి
- కాంగ్రెస్ కిసాన్ సెల్ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ మాసిన వెంకట్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపచేసేలా కృషి చేస్తామని కాంగ్రెస్ కిసాన్ సెల్ సిద్దిపేట జిల్లా సెక్రెటరీ మాసిన వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇల్లు పథకం తీసుకొచ్చిందని చెప్పారు. ప్రజలకు ఇంత మంచి పథకాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వే అన్ని గ్రామాల్లో జరుగుతుందని, అర్హులైన వారు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు పుకార్లు నమ్మవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సూచన మేరకు అర్హులను గుర్తింస్తుందన్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు రాదేమో అని అపోహ పెట్టుకోవద్దని భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎవరైనా వచ్చి డబ్బు అడిగితే ఇవ్వవద్దని, అలాంటి వారిపై గుర్రాలగొందిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కానీ, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఎర్ర హరీశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో కూరగాయలను విక్రయిస్తున్న నిర్మల

చదువంటే ఇష్టం.. బతుకేమో భారం

కుటుంబపోషణకు కూరగాయలు అమ్ముతున్న ఇంటర్ విద్యార్థి

ఎంబీబీఎస్ చదవడమే లక్ష్యంగా కష్టపడుతున్న గిరిపుత్రిక

నారాయణఖేడ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు కుటుంబ పోషణ కోసం పడుతున్న బాధలు చూడలేక ఒకవైపు కూరగాయల వ్యాపారం చేస్తూనే మరోవైపు ఇంటర్మీడియట్ చదువుతున్నది సంగారెడ్డిజిల్లా నారాయణఖేడ్ మండలం కొండాపూర్ శివార్‌సందు తండాకు చెందిన నిర్మల. స్వశక్తితో తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తూ, ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యంగా చదువుతున్నది.

శివార్‌సందు తండాకు చెందిన వడితే చందర్, చంగ్లిబాయికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారికి ఎకరం భూమి ఉండగా, ఆరుగురు పిల్లలను పోషించడం వారికి కష్టంగా మారింది. ఉన్న ఎకరం భూమితోనే కష్టపడి పెద్ద కుమార్తె లత, రెండో కుమార్తె భూలీల వివాహాలు జరిపించారు. మూడో కూతురు బుజ్జి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటుంది. నాల్గో కుమార్తె నిర్మల, ఐదో కుమార్తె వైశాలి చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కుటుంబపోషణకు, అక్కల వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చడానికి పడుతున్న గోసను చూసిన నిర్మల పదో తరగతి పూర్తయ్యాక ఏదోఒక పని చేస్తూనే చదువుకోవాలని భావించింది. నిర్మల ప్రాథమిక విద్యను కొండాపూర్‌లోనే పూర్తి చేయాగా, పదో తరగతి వరకు సిద్దిపేటలోని గురుకుల పాఠశాలలో చదివింది. టెన్త్‌లో 9.0 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో నారాయణఖేడ్ పట్టణంలోని పొట్టిశ్రీరాములు చౌక్ సమీపంలో కూరగాయల దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంది. ఒకవైపు కూరగాయల దుకాణం నడుపుతూనే, ఖేడ్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీలో చేరింది. కూరగాయల దుకాణం నడుపుతూ చదవడం కష్టతరంగా మారడంతో మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పింది. అయినప్పటికీ ఛాలెంజ్‌గా తీసుకుని రెండో సంవత్సరంలో మంచి మార్కులు తెచ్చుకుని.. ర్యాంకు సాధించి, ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడమే లక్ష్యంగా చదువుతున్నది. తెల్లవారుజామున 4 గంటలకు కూరగాయల మార్కెట్‌కు వచ్చి హోల్‌సేల్‌లో కూరగాయలను కొనుగోలు చేసి, 6 గంటల వరకు దుకాణం సిద్ధం చేసుకుంటుంది. తన సోదరి వైశాలి నిర్మల దుకాణానికి సాయపడుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయల దుకాణం నడుపుతారు. వ్యాపారం లేని సమయంలో చదువుకుంటారు. కళాశాలకు వెళ్లిన సమయంలో వారి తండ్రి దుకాణం చూసుకుంటాడు. కుటుంబ పరిస్థితులతో ఒకవైపు వ్యాపారం చేస్తూనే.. మరోవైపు తనకు ఇష్టమైన చదువును వదలకుండా కళాశాలకు వెళ్తున్న నిర్మల తన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరుకుందాం.

క్రమ శిక్షణతో తరగతులకు హాజరవుతున్నది.



మా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వడిత నిర్మల క్రమశిక్షణ కల అమ్మాయి. తరగతులకు చక్కగా హాజరవుతుంది. పట్టణంలోని ప్రధాన చౌక్‌లో కూరగాయల వ్యాపారం చేస్తూనే చదువుకుంటుంది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

- రమేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్

ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడమే లక్ష్యం

మా అమ్మనాన్న ఉన్న కొద్దిపాటి భూమిలో కష్టపడి మమ్మల్ని పోషిస్తున్నారు. వారు పడుతున్న బాధలు చూడలేక కూరగాయల వ్యాపారం చేస్తూనే చదువుకుంటున్నా. కష్టంగా ఉన్నప్పటికీ, కుటుంబ పరిస్థితుల వల్ల తప్పడం లేదు. బాగా చదువుకుని ఎంబీబీఎస్ సీటు దక్కించుకుంటా. అదే నా లక్ష్యం.

- నిర్మల, విద్యార్థిని



జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ముంబయిలో నిర్వహించిన జాతీయ స్థాయి రంగోత్సవ్ చిత్రలేఖన పోటీల్లో సత్తాచాటి బంగారు, కాంస్య పతకాలను పొందినట్లు ప్రిన్సిపాల్ బి.శ్యామలత తెలిపారు. విద్యార్థుల్లో 11 మంది బంగారు పతకాలను, 8 మంది కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. మరో ఆరుగురు విద్యార్థులు వెండి పతకాలు పొందగా, ఒకరు కన్సోలేషన్ బహుమతిని సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలత రిమార్కేబల్ కాంట్రిబూషన్ ఇన్ ఆర్ట్ అండ్ ఎడ్యుకేషన్ అవార్డుకు, ఆర్ట్ టీచర్ జె.దినేష్‌కుమార్ కళావిభూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు.

వాహనం టైర్లు చోరీ

కౌడిపల్లి , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు ఎదురుగా నిలిపి ఉన్న వాహనం వెనుక టైర్లను గుర్తుతెలియని దుండగులు దొంగిలించిన సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పండ్ల వ్యాపారి పట్నం అంజనేయులు ఐదేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ షాపును అద్దెకు తీసుకుని పండ్లు విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో తన పండ్లను తీసుకొచ్చే వాహనాన్ని (బొలెరో) షాపు ఎదుట మంగళవారం రాత్రి నిలిపి ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు మరుసటి రోజు బుధవారం తెల్లవారుజామున చూసేసరికి వాహనం వెనుకవైపు ఉన్న రెండు టైర్లుతో పాటు అదనంగా ఉన్న డెక్స్‌ను సైతం చోరీకి గురయ్యాయి. పట్నం అంజనేయులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దొంగతనానికి గురైన వాహనం వెనుక టైర్లు

న్యూస్ బాక్స్

డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన బిరుదు



రాజేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన బిరుదు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జ్యోతిష్య రంగంలో ఆయన చేసిన సేవలకు ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు కేపీ, నాడీ సెమినార్‌లో భాగంగా డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి 'జ్యోతిష్య పరిహార భాస్కర' బిరుదుతో సత్కరించారు.

కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్‌కు సన్మానం

కోహెడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిగురు కొమురయ్య ఇటీవలే కొమురవెల్లి దేవస్థానం పాలక మండలి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. బుధవారం కోహెడ మల్లన్నస్వామి ఆలయంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానం చేశారు. తన నియామకానికి సహకరించిన బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కురుమ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం మండలాధ్యక్షుడు శేఖర్, అశోక్, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జయంతి

హుస్నాబాద్/కోహెడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే దివంగత బొమ్మ వెంకటేశ్వర్లు జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాగారం రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, నాయకులు చిత్తారి రవీందర్, కోమటి సత్యనారాయణ, బంక చందు, రాజిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కోహెడలో బొమ్మ వెంకటేశ్వర్లు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ బి.తిరుపతిరెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు, ముంజ తిరుపతి పాల్గొన్నారు.

'తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి'

గజ్వేల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్ చెత్త బండికి ఇవ్వాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఒకటవ వార్డులో బుధవారం ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడంపై కమిషనర్ అవగాహన కల్పించారు. వారివెంట మునిసిపల్ కౌన్సిలర్ బొగ్గుల చందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

మనిషిని.. మనిషిగా మార్చే జ్ఞానదీప్తి భగవద్గీత

గజ్వేల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మనిషిని.. మనిషిగా మార్చే జ్ఞానదీప్తి భగవద్గీత అని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో బుధవారం గీతా జయంతి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యెల్లు రాంరెడ్డి, మనోహర్‌యాదవ్, నిమ్మ రమేశ్ పాల్గొన్నారు.

సింగారం మాజీ సర్పంచ్ భూ ఆక్రమణపై నిగ్గు తేల్చండి

గజ్వేల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగారం మాజీ సర్పంచ్ భూ ఆక్రమణపై నిగ్గు తేల్చాలని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గూడూరి రాజు డిమాండ్ చేశారు. సింగారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సింగారం మాజీ సర్పంచ్ భర్త భూఆక్రమణకు పాల్పడ్డారని, 250 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం ఇస్తే అదనంగా భూమిని ఆక్రమించుకుని ఇళ్లను కట్టుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కబ్జా చేసిన స్థలాన్ని విడిపించి ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాములు, నవీన్‌కుమార్, స్వామి, శివయ్య, పెంటయ్య, శ్రీను, అశోక్, రాజు పాల్గొన్నారు.

పిల్లలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి: సీఐ

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, ముత్యంరాజు అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో పాన్ డబ్బాలు, కిరాణాషాపులతో పాటు పట్టణ శివారు ప్రాంతంలో డ్రగ్స్ ఇతర పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే డయల్ 100 లేదా గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మొక్కజొన్నకు కత్తెర పోటు

- మందులు పిచికారీ చేసినా సోకుతున్న పురుగు
- ఆందోళన చెందుతున్న రైతులు





అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండాలో కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పంట

అక్కన్నపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో యాసంగిలో 7,156 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సాగుచేసిన మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు ఉధృతి విపరీతంగా ఉంది. మొక్కదశలోనే పంటపై కత్తెర పురుగు సోకి ఆకులను తినేస్తూ రంధ్రాలు చేస్తుండడంతో పంట ఎదగడం లేదు. పంట వేసి 30 రోజులవుతున్నా పురుగు బెడద వదలడం లేదు. ఖరీదైన మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. నాలుగురోజులకు, వారానికి ఒకసారి రైతులు పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. మందు ప్రభావం ఉన్నంతవరకు కత్తెర పురుగు ఉధృతి తగ్గినా.. ఆ తరువాత మళ్లీ సోకుతుంది. దీంతో దిగుబడి తగ్గిపోతుంది. కొన్ని సందర్భాల్లో పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

రైతుల్లో తగ్గని ఆసక్తి..

యాసంగిలో మొక్కజొన్న సాగుచేస్తే ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ప్రస్తుత ధరలను బట్టి రూ.85 వేల నుంచి రూ.95 వేల వరకు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కానీ మొక్కజొన్నకు కత్తెర పురుగు సోకుతుండడంతో దిగుబడి దాదాపు తగ్గిపోనున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు తగిన సూచనలు ఇస్తున్నాం



మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకినట్లు రైతులు చెబితే పంటలను పరిశీలించి తగిన సూచనలు ఇస్తున్నాం. కత్తెర పురుగు నివారించడానికి పురుగు మందులతో పాటు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి. విత్తనం నాటిన రెండువారాల తర్వాత ఒక లీటర్ వేపనూనెను 200ల లీటర్ల నీటిలో కలిపి మొక్కలు, నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. దీనివల్ల గుడ్ల నుంచి పురుగులు బయటికి రాకుండా నిరోధిస్తుంది. అదేవిధంగా విత్తనం నాటిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో ప్రొఫినోపాస్ 250 మిల్లీలీటర్లు, ఒక లీటరు వేప నూనె 200 లీటర్లు నీటిలో కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి. 20 నుంచి 30 రోజుల మధ్యలో ఎకరానికి ఇమామెక్టిన్ బెంజ్ 100 గ్రాములు లీటర్ వేప నూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కత్తెర పురుగు అన్ని కాలాల్లో వ్యాప్తి చెందుతుంది. ఒక పంటను ఆశిస్తే మిగిలిన చుట్టుపక్కల ప్రాంతాల్లో పంటలకు తొందరగా ఆకర్షిస్తుంది. ఈ పురుగు ఉదయం పూట ఆకుల మధ్యలో ఉండి రాత్రిపూట ఆకులను తిని పంటను నాశనం చేస్తుంది. కాబట్టి పురుగు మందులను సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకుంటే మంచిది.

- కరంటోతు శ్రీలత, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, రామవరం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే 'పల్లా'



ఎమ్మెల్యే తరపున విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నాడు. తండ్రిని కోల్పోయిన పేదింటి చిన్నారుల ఫీజు బకాయిలు చెల్లించి హామీని నెరవేర్చారు. కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీహరి కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. చేర్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శ్రీహరి కూతురు అభిజ్ఞ (మూడో తరగతి), కుమారుడు అద్విక్ (ఒకటవ తరగతి) చదవుతున్నారు. రూ.30 వేలు పాఠశాల ఫీజు చెల్లించాల్సి ఉండగా శ్రీహరి మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ భీమనపల్లి కరుణాకర్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చలించిన పల్లా మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, విద్యార్థుల చదువుకు భరోసా ఇచ్చి ఫీజు చెల్లిస్తానని హామీఇచ్చారు. ఈ మేరకు రూ.30 వేలు అందించడంతో ఎమ్మెల్యే పల్లా తరపున బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, మాజీ సర్పంచ్ భీమనపల్లి కరుణాకర్ బుధవారం పాఠశాల యాజమాన్యానికి డబ్బులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



సిద్దిపేట పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్/మద్దూరు/ధూళిమిట్ట/హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేసేలా చొరవ తీసుకుంటామని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వే అంతట జరుగుతుందని అర్హులైన వారు ఆందోళన చెందొద్దన్నారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్, రాషాద్, నజ్జు, బబులు, ఫయాజ్ పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 561 మంది దరఖాస్తు చేసుకున్నారని పంచాయతీ కార్యదర్శి రేణుక తెలిపారు. బుధవారం దరఖాస్తుదారుల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇందిరమ్మ కమిటీ కన్వీనర్, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ యాప్‌లో నమోదు చేశారు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లో అధికారులు సర్వే ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరించి సర్వేను బుధవారం కొనసాగించారు.

కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై బీజేపీ బైక్ ర్యాలీ



హుస్నాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగడుతూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ జరిపారు. అనంతరం జరిగిన కార్నర్ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొంత మందికే అందించిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతానని మాట మరిచారని ఆరోపించారు. కొత్తకొండతో పాటు ఇందుర్తిని మండలాలు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బత్తుల శంకర్‌బాబు, ఖమ్మం వెంకటేశం, తోట స్వరూప, జనగామ వేణుగోపాల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

గణితంలో మెళకువలతో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గణితంలో మెళకువలతో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు మండలస్థాయిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఈ పోటీని నిర్వహించారు. ఇందులో మొదటి మూడుస్థానాలు పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తెలంగాణ గణితఫోరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రఘోత్తంరెడ్డి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం కార్యదర్శి జీ.వేణుగోపాల్, కోశాధికారి వెంకటేశ్వర్, రాష్ట్ర సలహాదారుడు, కొడకండ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కరీమొద్దీన్, వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకుల సమస్యల పక్షాన పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ సహాయ సహకారాలు ఉండాలన్నారు. ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో డీఎస్పీ పదవికి రాజీనామా చేసి వచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు కనకయ్య, ఉద్యోగులు రవికుమార్, వెంకట్, సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయ వడ్డెర సత్రం డైరెక్టర్‌గా స్వామి



స్వామిని సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆలయ వడ్డెర, వడ్డె రాజుల సామాజిక సత్రం డైరెక్టర్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కొండపాక గ్రామానికి చెందిన రేపాక స్వామి నియామకమయ్యారు. సత్రం చైర్మన్ జరిపట్ల రాములు నియామకపత్రం అందజేశారు. కొండపాకలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. స్వామికి వడ్డెర కులస్తులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగ విద్యార్థుల మహాసభను విజయవంతం చేయాలి

- ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ము శేఖర్

గజ్వేల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభను విజయవంతం చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ము శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా మాదిగ జాతిని మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ఎంఎస్ఎఫ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశపాగ గౌతమ్, ఇన్‌చార్జిగా పెరుమల్ల సంజయ్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్, అధికార ప్రతినిధిగా గదరాజు అజయ్, ఉపాధ్యక్షులుగా డాకాని అఖిల్, బర్ల అభినవ్, కొమ్ము రాకేశ్, కార్యదర్శులుగా అజయ్, రామంచ నవీన్, సహాయ కార్యదర్శులుగా వివేక్, భానుప్రసాద్, విక్రమ్, అరుణ్, కార్యవర్గ సభ్యులుగా జశ్వంత్, ప్రదీప్, ప్రభాస్, మదన్, రంజిత్, అఖిల్, వంశీకృష్ణ, అభిలాష్, అరుణ్, విష్ణు వర్ధన్, తరుణ్, అక్షయ్, మనోజ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి



జగదేవ్‌పూర్‌లో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్/బెజ్జంకి/మద్దూరు/డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాధవరెడ్డి, ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ కృష్ణమోహన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని బాలుర పాఠశాలలో సీఎం కప్ పోటీలను ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, నరసయ్య, ఎంఈవో మహతిలక్ష్మి, సూపరింటెండెంట్ అంజయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభచూపాలని మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సూచించారు. బుధవారం మద్దూరులో సీఎం కప్ పోటీల ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, ఎంపీవో వీరరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మేక మల్లేశం పాల్గొన్నారు.

డాక్టర్లు రారు.. మందులు ఉండవు!

ఐదోపేజీ తరువాయి



మద్దూరు మండలం లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదని చెబుతున్నారు.

- సిద్దిపేటలోని కాళ్లకుంట కాలనీ బస్తీదవాఖానలో పారసిటమాల్, సిట్రిజన్, దగ్గు మందు కొరత ఉంది. ఉన్న మందులతోనే నెట్టుకొస్తున్నారు. గతంలో ఉన్న మెడికల్ ఆఫీసర్ సెలవులో వెళ్లడం వల్ల డిప్యూటేషన్‌పై మరో వైద్యుడు విధులు నిర్వర్తిస్తున్నారు.
- బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10 దాటినా సిబ్బంది, వైద్యులు రాలేదు. ఒక ఫార్మసిస్టు, నైట్ డ్యూటీ స్టాఫ్‌నర్సు మాత్రమే విధుల్లో ఉన్నారు.
- కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఉదయం 9.30 గంటలు దాటినా ఆసుపత్రికి రాలేదు.
- చేర్యాల మండలం ముస్త్యాల పీహెచ్‌సీ ఉదయం 9.30గంటల వరకు కూడా తెరుచుకోలేదు.
- సిద్దిపేటలోని అంబేడ్కర్‌నగర్ పీహెచ్‌సీలో 158 రకాల మందులు అందుబాటులో ఉండాలి. కానీ 110 మాత్రమే ఉన్నాయి. ప్రధానంగా బీపీ, మల్టీవిటమిన్ టాబ్లెట్ల కొరత ఉంది.

సిబ్బంది, మందుల కొరత

జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రతీ పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలో ఒక వైద్యాధికారి తప్పనిసరిగా ఉండాలి. స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్లు అవసరం. కానీ చాలాచోట్ల అవసరమైనంత సిబ్బంది లేరు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను సైతం భర్తీ చేయడం లేదు. పలుచోట్ల బీపీ, షుగర్ టాబ్లెట్లతో పాటు డైక్లోఫినాక్ ఇంజెక్షన్లు, లివోసిట్రిజన్, పారాసిటమాల్ టాబ్లెట్లు సరిపడా లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇదే ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రి దృష్టికి తీసుకెళ్తే వైద్యపరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని, మరింత మెరుగైన సేవలను జిల్లా ప్రజలకు అందించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సిద్దిపేటలో జర్నలిస్టుల నిరసన



సిద్దిపేటలో కెమెరాలతో నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయనీయమైన చర్య అని టీడబ్ల్యూజేయూ జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. జర్నలిస్టులపై మోహన్‌బాబు తన అనుచరులు దాడిచేయడాన్ని నిరసిస్తూ సిద్దిపేటలో టీడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనను చేపట్టారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్ నుంచి పాత బస్టాండ్ వరకు నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ వద్ద కెమెరాలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేయూ సహాయ కార్యదర్శి సంజీవరెడ్డి, గౌరవ సలహాదారు రంగధాంపల్లి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టులపై దాడులు సమంజసం కాదని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మైనారిటీ డిక్లరేషన్ సంగతి ఏమైంది..?



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా, ఎన్నికల్లో మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీ అమలుకాలేదని బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు అబ్దుల్ మొయిజ్ మండిపడ్డారు. బుధవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మైనారిటీలకు అరచేతిలో స్వర్గం చూపెట్టిందన్నారు. మంత్రి పదవి ఇవ్వడానికి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ మైనారిటీ నాయకుడే దొరకలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్, నాయకులు బాబుజాని పాల్గొన్నారు.

అంతర పంటలతో లాభదాయకం: ఏడీఏ

రాయపోల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు మూడేళ్ల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, పప్పు ధాన్యాలు, ధనియాల వంటి పంటలు సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బాబూనాయక్ సూచించారు. బుధవారం ఆయన ఏవో నరేష్‌తో కలిసి రాయపోల్ మండలం రామారంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు.

పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి: ఎంఈవో

కుకునూరుపల్లి/రాయపోల్, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కుకునూరుపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ నెలలో ఎఫ్ఎల్ఎన్ మధ్యంతర పరీక్షలు ఉన్నందున వాటికి విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అధికారులు తనిఖీ చేశారు.

ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నవీన్‌కుమార్

సిద్దిపేట టౌన్/చేర్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా డా. మాంకాల నవీన్‌కుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు తెలిపారు. బుధవారం సిద్దిపేటలోని వీఎస్ఎస్ కన్వెన్షన్‌లో నియామకపత్రం అందజేశారు. నవీన్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య మహాసభ కార్యరాష్ట్ర దర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అయిత రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం కమిటీని ఎన్నుకున్నారు. యూత్ జిల్లా అధ్యక్షుడిగా మంకాల నగేష్ (కొమురవెల్లి), ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి శివకుమార్((సిద్దిపేట), కోశాధికారిగా చిట్టా నాగరాజు(చేర్యాల), అదనపు కార్యదర్శిగా తేరాల మారుతి(హుస్నాబాద్) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.